క్లుప్తంగా

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

గోనెగండ్ల : ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది చేపట్టే ఎన్‌సీడీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆదోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి సూచించారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రికార్డులను, ఆస్పత్రిలో గదులు, స్టోర్‌రూమ్, వార్డు గదులు, తదితర గదులను ఆమె పరిశీలించారు. ఆస్పత్రి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రంగ రవళి, రజిని, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన సునీల్ భార్య సునీత, కుమారుడు యేసేబు ఈనెల 17వ తేదీ నుంచి కనిపించడం లేదని భర్త సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామ్‌నాథ్ బుధవారం తెలిపారు. రెండు రోజులపాటు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో గాలింపు చేపట్టినా కనిపించకపోవడంతో సునీల్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయండి

నందవరం : పీడీఎస్ బియ్యం ఇంటింటికీ పంపిణీ చేయాలని డీలర్లకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఎస్‌డీటీ మహేష్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రేషన్ కార్డు సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో రేషన్ కార్డులు 7,836 మంది పెండింగ్‌లో ఉన్నారని, త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు. అలాగే ఎండీయూ వాహనల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుబ్బారెడి, వీఆర్వోలు పాల్గొన్నారు.

వినియోగదారుల ప్రయోజనాలే ముఖ్యం



మాట్లాడుతున్న ఎల్‌ఐసీ కడప మార్కెటింగ్ మేనేజర్

ఎమ్మిగనూరుటౌన్: ఎల్‌ఐసీ పాలసీ దారులు, వినియోగదారుల ప్రయోజనాలు కాపాడటమే సంస్థ లక్ష్యమని ఆ సంస్థ కడప మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌సుందర్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఐసీలో పెన్షన్ పాలసీలు, సింగిల్ ప్రీమియం పాలసీలు, దీర్ఘ కాలిక ప్రయోజనాలతో కూడిన పాలసీలు అందుబాటులో వున్నాయన్నారు. సమావేశంలో కడప్ సేల్స్ అధికారి సోల్మోన్ రాజ్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ పులినాయక్, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌లో మోసపోయిన మహిళకు న్యాయం

ఆదోని అర్బన్: పట్టణంలో సైబర్ క్రైమ్‌లో మోసపోయిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి ఆదోని త్రీటౌన్ పోలీసులు న్యాయం చేసి కోర్టు ద్వారా రూ.5.06 లక్షలను బుధవారం అందజేశారు. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన మేరకు వివరాలు.. ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సువర్ణమ్మకు ఫిబ్రవరి 3వ తేదీన సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ ఖాతాలో ఎక్కువ డబ్బు ఎలా వచ్చింది అని బెదిరింపులకు గురి చేసి, ఆమె ఖాతాలో ఉన్న రూ.5,06,800 కాజేశారు. అదేనెల 17వ తేదీన ఆమె త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సైబర్ క్రైమ్ వింగ్ ద్వారా పోయిన డబ్బును తిరిగి రప్పించి కోర్టు అనుమతితో బాధితురాలు సువర్ణమ్మ తమ్ముడు సల్మాన్‌కు అందజేశారు. దీంతో బాధితురాలు తమ్ముడు సల్మాన్ సీఐకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ అరెస్టలతో ఉద్యమాలు ఆపలేరు

ఎమ్మిగనూరుటౌన్: అక్రమ అరెస్టలు చేసి ఉద్యమాలను ఆపలేరని కేవీపీఎస్, చర్మకారుల సంఘ నాయకులు తిమ్మన్న, చిన్నప్ప,రాజరమేష్, సుమాల ఆంథోని, సుమాల రాజులు అన్నారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి విజయవాడలో ఆందోళన చేస్తున్న చర్మకాలులు, డప్పు కళాకారులపై పోలీసులు దౌర్జన్యం చేసి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాముడు, ఆనంద్, ఎల్లన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- అధ్వానంగా సుళేకేరి–హాల్వి రోడ్డు
- అడుగడుగునా గుంతలు
- రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రజల ఇక్కట్లు
- ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ల వల్లే ఈ దుస్థితి
- 8 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ప్రయాణం



అధ్వానంగా ఉన్న రహదారి

సుళేకేరి నుంచి హాల్వి వరకు ఇలాంటి రోడ్డే

కూలడానికి సిద్ధంగా ఉన్న కల్వర్టు

కౌతాళం: మండలంలోని సుళేకేరి నుంచి హాల్వి రహదారి గుంతల మయమై అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనదారులు వీటిని దాటుకుని వెళ్లాలంటే చాలా కష్టంగా మారింది. ఈ రోడ్డుపై 7కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట సమయం పడుతుంది. దీంతో వాహనదారులు చుట్టూ తిరిగి ఉరుకుంద మీదుగా వెళ్లాల్సి వస్తోంది. సంక్రాంతి పండుగ కంతా రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లుగా మారుస్తానన్న ముఖ్యమంత్రి, ఉగాది పండుగా వస్తున్న ఈ రోడ్డుకు మాత్రం పిడికెడు మట్టి వేసిన దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారిని బాగుచేయాలని కోరుతున్నారు.

7 కిలోమీటర్లు.. అరగటం ప్రయాణం

మండల కేంద్రమైన కౌతాళం నుంచి హాల్వి రహదారిలో 7కిలోమీటర్లు సుళేకేరి గ్రామం వరకు రోడ్డు బాగుంది. సుళేకేరి నుంచి హాల్వి వరకు ఉన్న 7కిలోమీటర్ల రోడ్డంతా గుంతలమయంగా మారి ప్రయాణాలు సాగించలేని విధంగా తయారైంది. 7కిలోమీటర్ల రోడ్డు అరగంట సమయం పడుతుండటంతో కౌతాళం నుంచి హాల్వికి వెళ్లే వాహనదారులు ఉరుకుంద మీదుగా వెళుతున్నారు. ఉరుకుంద మీదుగా వెళితే 8కిలోమీటర్లు దూరం పెరుగుతుంది. అయినా రోడ్డు అధ్వానంగా ఉండడంతో చాల మంది ప్రయాణికులు ఉరుకుంద మీదుగానే ప్రయాణించడానికి ఇష్ట పడుతున్నారు.

గత ప్రభుత్వంలో 7కిలోమీటర్ల రోడ్డు

కౌతాళం నుంచి సుళేకేరి వరకు గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. సుళేకేరి నుంచి హాల్వి వరకు రోడ్డు బాగానే ఉండడంతో వేయలేదు. ఈ 10నెలల కాలంలో ఈ రోడ్డు దారుణంగా గుంతల మయంగా మారడానికి ప్రధాన కారణం ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు తిరగడమే. కనీసం మరమ్మతులు ప్యాచ్ వర్క్ కూడ చేయలేక పోవడంతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటే భయపడుతున్నారు. ఈరోడ్డులో చాల చోట్ల ఉన్న కల్వర్టులకు ఎలాంటి ఆధారం (ప్రహరీ గోడలాంటి) లేక పోవడంతో కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటికి కూడా మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

ప్రయాణం చాలా కష్టంగా మారింది



సుళేకేరి నుంచి హాల్వి రోడ్డుపై ప్రయాణం చాల కష్టంగా మారింది. సుళేకేరి నుంచి హాల్వికి వయా పాదలకుంట మీదుగా 7కిలోమీటర్ల ఉన్న అర్ధగంట సమయం పడుతుంది. సుళేకేరి నుంచి మాగ్రామం పాదలకుంట ఒకన్నర కిలోమీర్ ఉన్నా.. పది నిమిషాలు పడుతుంది. రోడ్డంతా గుంతలుగా మారింది. కొత్త రోడ్డు వేయడం లేదు. కనీసం మరమ్మతులు చేపట్టడం లేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకావాలి.

– చాగి హనుమంతు, పాదలకుంట

కొత్త రోడ్డుకు ప్రతిపాదనలు పంపాము

సుళేకేరి నుంచి హాల్వి వరకు ఉన్న రోడ్డుకు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మరమ్మతులు చేపట్టలేం. రోడ్డు చాల వరకు దెబ్బతింది. ఈరోడ్డు గుండా ఇసుక టిప్పర్లు కూడా తిరుగుతున్నాయి. అందుకే ఈ రోడ్డును కొత్త రోడ్డుగా మార్చాలని రెండు రూ.కోట్లతో ప్రతిపాదనలు పంపాము.

–ఏఈ సాయిసురేష్

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను బుధవారం రాష్ట్ర పరిశీలకుడు అబ్రహాం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో గదులు, పరీక్షలు రాసే విద్యార్థులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం హిందీ పరీక్షకు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 625 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 615మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పది మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ ఎత్తివేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ తొలగించి, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని లియాఫి జోనల్, డివిజన్ నాయకులు రమేష్, ఆద్రయ్య, రామన్న, జయరాం, హరినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో లియాఫీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు మద్దతుగా పట్టణంలోని ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘం(లియాఫీ) ధర్నా చేపట్టింది. వారు మాట్లాడుతూ ఎల్‌ఐసీ పాలసీలపై విధించే జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలన్నారు. పాలసీలపై బోనస్ రేట్లు పెంచి, రూ.1లక్ష పాలసీలను పునః ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు ఏరినాథ్, అబ్దుల్ గఫార్ సాహెబ్, శివరాముడు, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

నందవరం : అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ, పఢాయి బీ ఫేస్-2 శిక్షన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి బుధవారం తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం ముగతి మోడల్ స్కూల్‌లో ఉంటుందని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు ఉదయం 8 గంటలకు మోడల్ స్కూల్‌లో హాజరు కావాలన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కలెక్టర్ బి.నవ్య

ఆదోని రూరల్: జిల్లాలో రీ సర్వే గ్రామసభ, రెవెన్యూ సదస్సుల్లో నమోదైన భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపుతామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా కార్యాలయ అధికారులు, ఎమ్మిగనూరు, ఆదోని తహసీల్దార్‌లతో కలిసి రీ సర్వే జరిగిన గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో అధికంగా వచ్చిన ఫిర్యాదులకు గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా రైతుల పట్టా భూములు ఇనాం భూములుగా నమోదవడం వల్ల ఎదురైన సమస్యలను క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. ఎమ్మిగనూరు మండలం కడివెల్ల, కందనాతి, ఆదోని మండలంలోని కుప్పగల్, ఢణాపురం, నారాయణపురం గ్రామాల్లో 303 మంది రైతుల భూ సమస్యలను పరిష్కరించామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని తహసీల్దార్ శివరాముడు, ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషఫణి, జిల్లా కార్యాలయం అధికారులు వేణుగోపాల్‌శర్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి



నివాళులర్పిస్తున్న మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామయ్య(59) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరపున వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి దుద్ది గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురండి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద లక్షల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన బస్టాండ్‌ను నిరుపయోగం ఉంచారని, దానిని ఉపయోగంలోకి తీసుకుని రావాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉరుకుంద బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణంలో ఉన్న మట్టిని చదును చేసుకుని బస్సులు నిలబడే విధంగా చేయాలని డిమాండు చేశారు. మండల కన్వీనర్ ఈరన్న, నాయకులు హనుమంతు, లక్ష్మన్న పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

మంత్రాలయం : భూముల రీ సర్వేలో ఉత్పన్నమవుతున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వేలో రైతుల భూముల్లో 20 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు సర్వే అధికారులు కోతలు విధిస్తున్నారని వాపోయారు. ముఖ్యంగా సర్వీసు ఇనామ్ భూములను ఇనామ్‌లుగా చూపిస్తున్నారని వ్యక్తం చేశారు.ఆర్‌ఓఆర్ అడంగల్ కేసులు పెరిగిపోతున్నా త్వరతగతిన పరిష్కరించడం లేదని ఆరోపించారు. రైతు మండల కార్యదర్శి గాబ్రెల్, రైతులు పంపాపతి, బీబీ మస్తాన్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

పెద్దకడబూరు : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పట్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎంపీ యువరాజు మాదిగ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులంలో ఉన్న 59 ఉప కులాలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని గత 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలకు ఫలితం దక్కిందన్నారు. వర్గీకరణ ద్వారానే అన్ని ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మారెప్ప(ఫైల్)

పెద్దకడబూరు: హనుమాపురం బస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శాంసోన్ అలియాస్ రంగన్న, ముక్కీరమ్మ కుమారుడు మారెప్ప(22) బనవాసి నుంచి బైక్‌పై ఎమ్మిగనూరు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ఎమ్మిగనూరు నుంచి ఆదోని వైపు వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో మారెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బైక్‌కు నిప్పు అంటుకొని మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు నీళ్ల పోసి అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, నీటి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.18.86 కోట్లు లక్ష్యం కాగా, రూ.8.36 కోట్లు వసూలు చేశామని తెలిపారు. మిగిలిన రూ.11.61 కోట్ల పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ యజమానులను కోరారు. నీటి పన్ను రూ.9.60 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.3 కోట్లు మేర వసూలు చేయడం జరిగిందన్నారు. మిగిలిన పన్నులను నెలాఖరిలోగా చెల్లించాలని, లేని పక్షంలో తమదైన శైలిలో వసూలు చేస్తామని హెచ్చరించారు.

నాటుసారాతో కుటుంబాలు ఛిద్రం



నాటుసారాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : నాటుసారా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలతో మరణాలు సంభవించి కుటుంబాలు రోడ్డున పడుతాయని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం నాటుసారా రహిత సమాజ నిర్మాణం కోసం అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో పోస్టర్లు అతికించి కరపత్రాలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగడం వలన కంటి చూపు కోల్పోవడం, కాలేయం దెబ్బ తినడం, గుండె, జీర్ణ కోశ తదితర వ్యాధులు వస్తాయన్నారు.

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈనెల 21 నుంచి ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) 3వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి సత్యన్న పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో జాతీయ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని చంద్రయ్య కొట్టాల ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక చంద్రయ్య కొట్టాలు ప్రాంతంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ఆప్రాంతంలో అధ్వానంగా వున్న మురుగు కాలువ, శిథిలావస్థలో వున్న పాఠశాలను ఆ ప్రాంత వాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు రమేష్, సుబాన్, బజారి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డును బాగు చేయండి

ఆదోని రూరల్: మండలంలోని ఢణాపురం క్రాస్ దగ్గర నుంచి హొళగుంద వరకు గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, ఎం.ఉచ్చీరప్ప డిమాండ్ చేశారు. బుధవారం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా రోడ్డును పరిశీలించారు. రోడ్డు పాడై పోయినా కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉచ్చీరప్ప, అంజనేయులు, చక్రవర్తి, డీవైఎఫ్ఐ నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సునితా విలియమ్స్‌కు స్వాగతం



ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ధైర్యంగా 9 నెలల పాటు అంతరిక్షంలో వుండి భూమి మీదకు చేరుకున్న ధీర వనిత సునితా విలియమ్స్‌కు స్వాగతం పలికేలా బుధవారం పట్టణానికి చెందిన కనకవీడు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కె.వెంకటేషప్ప గీసిన చిత్రమిది. ఈ కార్టున్ స్థానికులను విశేషంగా అకట్టుకుంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అందరి మన్ననలు పొందుతోంది. – ఎమ్మిగనూరుటౌన్

రేపటి నుంచి పాదయాత్ర భక్తులకు అన్నదానం

ఆదోని అర్బన్: ఆదోని చుట్టుపక్కల, కర్ణాటక రాష్ట్రం ప్రాంతాల నుంచి పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే భక్తులకు శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు అన్నదానం వితరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు మహర్షి విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు స్థానిక ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులోని శ్రీ సరస్వతిదేవి ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యార్థి బస్సును సమయానికి నడపాలి

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: మండలంలోని మేకడోణ, బల్లేకల్, పెద్దతుంబళం గ్రామాల విద్యార్థులకు విద్యార్థి బస్సు సమయానికి నడపాలని ఆర్టీసీ సీఐ మల్లికార్జునకు బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఉమాకాంత్, చిరు, నవీన్ మాట్లాడుతూ విద్యార్థి బస్సు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పుడుతున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలల, కళాశాలల సమయానికి బస్సు లేకపోవడంతో తరగతులు కోల్పోతున్నారన్నారు.

సీజనల్ హాస్టళ్లలో అవినీతిపై విచారణ చేపట్టాలి

ఆదోని సెంట్రల్/ఆదోని రూరల్ : సీజనల్ వసతి గృహాల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. బుధవారం రీ సర్వే గ్రామ సభలకు వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్యకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ వలసపోతున్న వారి పిల్లల కోసం మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థల అనుబంధంతో సీజనల్ హాస్టల్స్‌ను ప్రారంభించారన్నారు. అయితే విద్యార్థులకు భోజనవసతులను ఏర్పాటు చేయకుండానే దొంగ హాజరు చూపించి రూ.వేలకు వేలు దోచుకుంటున్నారని తెలిపారు.

పాఠశాల వేళల్లో స్వల్ప మార్పు

ఆదోని సెంట్రల్: పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పులు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల విద్యాధికారి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పాఠశాలలు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 5.00 గంటల వరకు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలు లేని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ఉదయం 7.45 గంటలకే ప్రారంభించి 12.30 వరకు కొనసాగించాల్సి ఉంటుందని తెలిపారు. బుధవారం నియోజకవర్గంలోని పదో తరగతి 19 పరీక్షా కేంద్రాలలో సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్షకు 3,739 మంది హాజరు కావాల్సి ఉండగా 3708 మంది హాజరై పరీక్షలను రాశారు. 31 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

కోసిగి ఎస్‌ఐగా హనుమంత రెడ్డి



కోసిగి: కోసిగి ఎస్‌ఐగా జి. హనుమంతరెడడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న చంద్రమహన్ కర్నూలు త్రీటౌన్ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న హనుమంతరెడ్డిని నియమించారు.

తాగునీటి సమస్యలపై పోరాటం

మంత్రాలయం : జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజిబాబు వెల్లడించారు. బుధవారం మంత్రాలయం మండలంలోని మాధవరం, చెట్నిహళ్లి, మంత్రాలయం గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పశ్చిమ ప్రాంతంలో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా మంత్రాలయం నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో హామీల అమలును పూర్తిగా విస్మరించదని ఆరోపించారు. యాత్రలో పార్టీ మండల కార్యదర్శులు తిక్కన్న, జయరాజు, నాయకులు మారెప్ప, సురేష్, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కన్నడిగుల పాదయాత్ర



రథాన్ని శ్రీశైలానికి తీసుకెళ్తున్న కన్నడ భక్తులు,



కాళ్లకు కర్రలు కట్టుకొని నడచి వెళ్తున్న భక్తులు

కోసిగి : మండల కేంద్రమైన కోసిగి మీదుగా కర్ణాటకు చెందిన వేలాది మంది భక్తులు నాలుగవ రోజు పాదయాత్రగా శ్రీశైలానికి తరలి వెళ్లారు. బుధవారం వేకువజామున నుంచే యాత్రను ప్రారంభించారు. కొందరు రథాలను, కావిళ్లను తీసుకెళ్తుండగా.. కొందరు యువకులు రెండు నుంచి మూడు అడుగులు కర్రలను కాళ్లకు కట్టుకొని నడుచుకుంటూ వెళ్లడం అందరినీ అకట్టుకుంది. మండల ప్రజలు భక్తులకు ఇబ్బందులు లేకుండా అర్లబండ, కోల్మాన్‌పేట, దుద్ది, ఉరుకుంద ఆర్చ్, దొరల చావిడి, కుర్లీ కాంప్లెక్, చైతన్య స్కూల్, రంగప్ప గట్టు, డి.బెలగళ్ గ్రామాలలో భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి, విశ్రాంతి ఆశ్రమాలు ఏర్పాటు చేశారు. మరి కొందరు చల్లటి పానీయాలు, మజ్జిగను పంపిణీ చేస్తున్నారు.